


# యోగి

**- ఆకునూరి మురళీకృష్ణ**



ఉగాది పోటీలో ఎంపికైన కథ

అందరికీ వేసినట్లుగానే వేణుకి కూడా శుభలేఖ వేసాను ఆ పెళ్ళికి. బిజినెస్ పనుల మీద రోజుకొక దేశం తిరిగేవాడు కేవలం ఆ శుభలేఖ చూసి పెళ్ళికి వస్తాడని మాత్రం ఊహించలేదు.

మా అక్కయ్య ఆఖరి కూతురి పెళ్ళి. నాన్నగారు బ్రతికుండగా అన్ని శుభకార్యాలూ ఆయన చేతుల మీదుగా మా ఊళ్ళోనే జరిగేవి. ఆ ఆనవాయితీని వదులుకోలేక వాళ్ళు వద్దని మొహమాటపడుతున్నా నేనే దగ్గరుండి పెళ్ళికి అన్ని ఏర్పాట్లు మా ఊళ్ళోనే చేసాను.

నా ఆధ్వర్యంలో జరుగుతుతున్న పెళ్ళి కనుక, అక్కయ్య కుటుంబానికి కూడా వేణు సుపరిచితుడు కావడంవల్లా వాడికి కూడా ఆహ్వానం పంపించడం సబబుగా వుంటుందని పంపాను కానీ వాడు పెళ్ళికి వస్తాడని కాదు. నేను ఊహించని విధంగా లండన్‌లో వుంటున్న వాడు కుటుంబంతో సహా రెండు రోజుల ముందుగానే పెళ్ళికి వచ్చి నన్ను ఆశ్చర్యానందాల్లో ముంచేసాడు.

ఫోన్లలోనూ, రైల్వేస్టేషన్లలోనూ హడావిడిగా మాట్లాడుకోవడమే తప్ప మేమిద్దరం చిన్నప్పట్లా తీరికగా మాట్లాడుకుని చాలా రోజులయింది. వాడి రాకని ఎలాగైతే ఊహించలేదో వాడి రాకతో నా జీవితంలో అనుకోని మార్పులు చోటుచేసుకుంటాయన్న విషయాన్ని కూడా నేను ఊహించలేకపోయాను. అయితే ఆ మార్పులు రావడానికి కారణం వాడు కాదని, అలా వచ్చేలా చేయడంలో వాడు ఒక పాత్రధారి మాత్రమేనని తర్వాత తర్వాత అర్థమయింది నాకు. ఒక్కోసారి అనిపిస్తుంటుంది అసలు వేణు ఆ పెళ్ళికి రాకపోయినా బావుండేదేమోనని... అదీ క్షణంలో వెయ్యోవంతు సేపు మాత్రమే. మరుక్షణమే ఆ ఆలోచన నా మనసులోంచి బలవంతంగా చెరిగిపోతుంది.

ఇప్పుడు నన్ను చూసుకుంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది.

* * *

శీతాకాలం కావడంతో సాయంత్రం ఐదింటికే సంధ్య చీకట్లు అలుముకుంటున్నాయి. పొగ మంచుతో కలిసిన సాయంకాలం గాలి శరీరాన్ని తాకుతూ వింత అనుభూతినిస్తోంది. సూర్యుడు నారింజ రంగులోకి మారి నెమ్మదిగా గోదావరి ఒడిలోకి ఒరిగిపోతున్నాడు. విశాలంగా ముందుకు సాగిపోయి దూరాన్నెక్కడో కొండలనానుకుంటూ మలుపు తిరుగుతున్న నది. ఆవలి ఒడ్డునుంచి మసగ్గా కనిపిస్తున్న చెట్టూ చేమా, నీటి మీద తేలుతున్న తెరచాప పడవలూ అన్నీ కలిపి ఆ దృశ్యం దేవుడు గీసిన అద్భుతమైన చిత్రంలా వుంది. నీటి అలల మీద గాలి చేస్తున్న సవ్వడి చెవులకి వింత సంగీతంలా వినిపిస్తోంది.

నేనూ వేణు గోదావరి ఒడ్డున ఇసుకలో కబుర్లు చెప్పుకుంటూ నడుస్తున్నాం. కాళ్ళకి ఇసుక చల్లగా తగులుతోంది. రోజూ చూసే దృశ్యమే అయినా సంధ్యా సమయంలో చాలా గోదావరిని చూడడం నాకు ఎప్పటికప్పుడు తాజా అనుభూతినిస్తూ వుంటుంది.

ఆరోజు నా దృష్టి ఆ అనుభూతిని ఆస్వాదించడం మీద లేదు. ఉద్వేగంగా వేణునే చూస్తున్నాను. వాడెలా ఫీలవుతున్నాడా అని గమనిస్తూ వాడి ముఖం చూస్తూ మనసులోని భావాలని చదవడానికి ప్రయత్నిస్తున్నాను.

నేను ఊహించినట్లుగానే వాడి ముఖం కూడా ఉద్వేగంగా వుంది. చూపులు గోదావరి అలల మీద నుంచి సాగి అలా పడవల తెరచాపల మీదుగా వెళ్ళి ఆవలి ఒడ్డునెక్కడో చిక్కుకుని పోయాయా అనిపిస్తున్నాయి. ఆ దృశ్యంలో దేనిని చూడాలో, ఏ అనుభూతిని మనసునింపుకోవాలో తెలియని వాడిలా, బడి నుంచి వచ్చి చిన్న పిల్లాడు తల్లిని చూసినట్లు ఆర్తిగా, ఆనందంగా చూస్తున్నాడు.

వాడి మనసులోని భావాలని చదువుతున్నట్లుగా అన్నాను "ఏమిటలా చూస్తున్నావు?"

"ఈ గోదావరి ఒడ్డున, ఈ ఇసుక తిన్నెల మధ్యన లభించే ఆనందం, శాంతి మరెక్కడా లభించవురా. చాలా రోజుల తర్వాత ఊపిరి పీల్చుకుంటున్నట్లుగా వుంది నాకు" కింద ఇసుకలో చతికిల పడుతూ అన్నాడు.

వాడి మాటలకి నా మనసు పులకించింది. వాడన్న దాంట్లో నిజం లేకపోలేదు. ఇన్నాళ్ళూ వాడు ఊపిరి తీయడం కూడా మర్చిపోయి పరుగులు తీస్తున్నాడు... డబ్బు వెనుక, విజయాల వెనుక, కీర్తి వెనుక...

"వంశీ, నా జీవిత లక్ష్యం ఏమిటో తెలుసా?" హఠాత్తుగా అన్నాడు.

"ఇప్పటికే చాలా సాధించావు. ఈ మారుమూల పల్లెటూరు ఎక్కడ? ప్రస్తుతం నువ్వు నడిపిస్తున్న మల్టీ నేషనల్ కంపెనీలెక్కడ? ఇక్కడి నుంచి వెళ్ళిన నువ్వు ఎవ్వరూ ఊహించలేనంత ఎత్తుకి ఎదిగావు, ఇంకా లక్ష్యాలేం వుంటాయి నీకు?" నవ్వుతూ అన్నాను.

"అదే పొరపాటు. ఇంత సాధించినా ఇంకా మనసులో ఏదో అసంతృప్తే నాకు. అసలు విజయం అన్నదే ఒక మత్తుమందు లాంటిది. దానికి అలవాటు పడిన వాడెవ్వడూ అది లేకుండా నిద్రపోలేడు. అనుక్షణం మళ్ళీ మళ్ళీ దాని రుచికోసం తహతహలాడిపోతూ వుంటాడు. నేను మాట్లాడుతున్నది బిజినెస్‌మేన్‌గా నాకున్న లక్ష్యాలని గురించి కాదు. మనిషిగా నా లక్ష్యం గురించి, ఒక రకంగా చెప్పాలంటే నా జీవిత అంతిమ గమ్యం గురించి!"

"ఏమిటది?" ఆసక్తిగా అడిగాను.

ఇసుక తిన్నెల మీద వెల్లకిలా ఆకాశంలోకి చూస్తూ చెప్పసాగాడు వాడు. "నీకు తెలుసుకదా? మా నాన్న ఒకప్పుడీ ఊళ్ళో వ్యవసాయ కూలి. తర్వాత క్రమక్రమంగా కౌలు చేయడం మొదలుపెట్టాడు. నేను పెద్దయ్యేవరకూ అంతకు మించి ఎదగలేకపోయాడు మానాన్న. అప్పట్లో నాకు చాలా గిల్టీగా వుండేది... మాకు సొంతంగా ఊళ్ళో కనీసం ఒక ఎకరం పొలమైనా వుంటే బావుండునని చాలా బలంగా అనిపించేది. నేను జీవితంలో ఎదుగుతున్నకొద్దీ క్రమక్రమంగా ఆ గిల్టీ ఫీలింగ్ అయితే పోయింది కానీ ఇప్పటికీ నన్ను నన్నుగా మలిచిన ఈ ఊళ్ళో నా అస్థిత్వాన్ని నిలుపుకునే ఏ భౌతికమైన ఆధారమూ లేదే అన్న

బాధ మాత్రం మిగిలిపోయింది."

"అదేమిటి వేణూ... నేను లేనూ? నా ఇల్లు లేదూ?" అన్నాను.

"నాకు తెలుసు, నేను చెప్పేది దాని గురించి కాదు. ఎప్పుడేనా ఈ ఉరుకులు పరుగుల జీవితంతో విసిగిపోయినప్పుడు... మనసు శాంతి కోరుకునే నిద్రలేని రాత్రుల్లో నాకు చాలా బలంగా అనిపిస్తూ వుంటుంది... చేసినదంతా చాలని. ఆ వ్యాపారాలూ వ్యవహారాలూ అన్నీ వదిలేసి హాయిగా మనూరికి వచ్చేసి ఇక్కడొక ఎకరం భూమి కొనుక్కుని ఒక కుటీరం నిర్మించుకుని ఏ వేద పాఠశాలో స్థాపించి ఆ పిల్లల వేద మంత్రోచ్చాటన వింటూ వ్యవసాయం చేసుకుంటూ ప్రశాంతంగా బ్రతికేద్దామని. ఎప్పటికైనా నా అంతిమ గమ్యం మాత్రం అదే!" అన్నాడు ఉద్వేగంగా.

వాడి మాటలకి ఆశ్చర్యంగా చూసాను.

"నేను ఇలా నాలుగు రోజులు పనులన్నీ మానుకుని రావడంవల్ల కొన్ని లక్షల రూపాయల నష్టం. అయినా నీ దగ్గర నుంచి వచ్చిన శుభలేఖ చూసి ఆగలేకపోయాను. ఇక్కడ నేను పొందే ఆనందం. అనుభూతితో పోల్చుకుంటే ఆ నష్టం పెద్ద లెక్కలోనిది కాదు. అన్నిటినీ మించి నా కుటుంబానికి మన మూలాలు ఎక్కడున్నాయో చూపించగల అవకాశం నాకు ఇది. నన్ను నేను రీఛార్జ్ చేసుకోవడానికి నాకు లభించిన అవకాశం ఇది." భావావేశంలో వున్నవాడిలా తాదాత్మ్యతతో కళ్ళు మూసుకుని అన్నాడు.

ఎందుకో తెలియదు కానీ వాడు అలా మాట్లాడుతుంటే నాక చాలా ఆనందంగా అనిపించింది. నా గురించి మాట్లాడకపోయినా నన్నే పొగుడుతున్నంత సంతోషంగా అనిపించింది.

పెళ్ళికి అన్ని ఏర్పాట్లు నేను చేసాననుకోవడమే కానీ నిజానికి నేను చేసినది పెత్తనం తప్ప మరేం లేదు. అన్ని ఏర్పాట్లు సిటీ నుంచి అక్కయ్య వాళ్ళు పంపించిన ఈవెంట్ మేనేజర్లే చూసుకున్నారు. నేను కల్పించుకుని మధ్య ఒకటి రెండు సలహాలిచ్చానంతే.

సలీ పెళ్ళి వాళ్ళ ఊళ్ళోనే జరగాల్సినది. కానీ మగ పెళ్ళివారు కూడా పల్లెటూళ్ళో పెళ్ళి వెరైటీగా వుంటుందని సరదాగా పడటంతో అక్కయ్య వాళ్ళు ఇక్కడ పెళ్ళిచేయడానికి ఒప్పుకున్నారు. పెళ్ళివారంతా ఆడ పెళ్ళివారితో సహా పక్కనున్న రాజమండ్రిలో హోటల్లో దిగి, పెళ్ళి రోజు ఉదయానికి మా ఊరు వస్తాననడంతో నాకు పెద్దగా పనేం లేకపోయింది. నిజంగా నేనే స్వయంగా అన్ని ఏర్పాట్లు చేసినా అంత సౌకర్యవంతంగా చేయలేనేమోననిపించేలా చిన్న చిన్న డిటెయిల్స్ దగ్గరనుంచీ వర్కవుట్ చేసి అన్నీ సమకూర్చేసారు సిటీ నుంచి వచ్చిన పెళ్ళి పెద్దలు (ఈవెంట్ మేనేజర్స్).

పెళ్ళివారు ఇక్కడ వుండే కాసేపటిలోనూ వాళ్ళకే ఇబ్బందులూ కలుగకుండా అన్ని జాగ్రత్తలూ వాళ్ళే తీసేసుకోవడంతో నాకు పూర్తి సమయం వేణుతో గడపడానికి అవకాశం చిక్కింది. చిన్నపుడు తిరిగిన ప్రదేశాలు చూస్తూ, అప్పటి కబుర్లు చెప్పుకుంటూ చాలా ఉత్సాహంగా గడిపాం. నాకంటే ఎక్కువ ఆనందించింది వేణునే.

చేలగట్లనీ, మామిడి తోపులని, మా ఊరి శివాలయాన్ని, గోదావరి ఒడ్డుని, మర పడవలనీ బల్లకట్టునీ, సహజత్వంతో కూడిన మా ఊరి అందాలన్నింటినీ వేణు కుటుంబ సభ్యులు కూడా బాగా ఎంజాయ్ చేసారు. వాళ్ళందరికీ మా మండువా ఇల్లు కూడా చాలా నచ్చింది. అంకిత భావంతో పనిచేసే పనివాళ్ళు, ఆదరించే ఇరుగు పొరుగు, అందరూ కలిసినప్పుడు చేసుకునే వేళాకోళాలు, హాస్యాలు అన్నీ వాళ్ళకి బాగా నచ్చాయి. మొత్తం మీద వాళ్ళు ఎరుగని మా జీవన విధానం వాళ్ళని అమితంగా ఆకట్టుకుంది. సాంప్రదాయ బద్ధంగా జరిగిన పెళ్ళిని కూడా వాళ్ళు బాగా ఎంజాయ్ చేసారు.

వేణు గురించి బాగా తెలుసు కనుక వాడు ఊళ్ళో ఉన్న నాలుగు రోజులూ వాడి టేస్ట్ తగినట్లుగా మా చిన్నప్పటి స్మృతులు నెమరువేసుకునేలా చాలా అందంగా ప్రోగ్రాం ప్లాన్ చేసాను నేను. ఒక్క నిమిషం కూడా వాడిని ఖాళీగా ఉంచలేదు. వాడు ఇక్కడ ఏయే ప్రదేశాల్లో తిరగాలనుకుంటాడో ఎవరెవరిని కలుసుకోవాలనుకుంటున్నాడో అన్నీ నేనే ఊహించి మరీ ప్లాన్ చేసాను.



రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్షలకి లక్షలు ఆశ చూపిస్తున్నారు రైతుకి. పంట మీద అంత సంపాదించాలంటే రైతుకి జీవితంలో అయ్యే పనికాదు. ఇదివరకైతే ముందుతరాల వారి గురించి ఆలోచించే వారు. ఇప్పుడలా కాదు. ముందు మనం సంపాదించుకోవాలి, సుఖపడాలి... ఆ తర్వాతే ఉంటే గింటే వారసుల గురించి ఆలోచన.

నా అంచనాలు తప్పుకాలేదు. మనిషి ఎంత ఎత్తుకి ఎదిగినా ఎన్ని దేశాలు తిరిగినా మౌలికంగా మారిపోడు. నాతో తిరుగుతున్నంత సేపూ దాదాపు ప్రతి సందర్భంలోనూ వాడు బాగా కదిలిపోయేవాడు. "ఇంత తీరికగా జీవితాన్ని అనుభవించి చాలాకాలమైందిరా. ఎప్పుడు ఎందుకు పెడుతున్నామో తెలియని పరుగు. మనసు కూడా గజిబిజి గందరగోళం. ఎప్పుడూ టార్గెట్లూ, యాక్షన్ ప్లాన్లూ, అనవసరమైన టెన్షన్లు, బిపీలు... జీవితంలో నేను కోల్పోతున్నదేమిటో నాకు అర్థమోతోందిరా" అన్నాడు.

నాణానికి బొమ్మా బొరుసు వున్నట్లుగానే మా ఇంట్లో వున్న . నాలుగురోజులు వాళ్ళు ఎంతగా ఎంజాయ్ చేసారో ఇక్కడ అడ్జస్ట్ అవలేక అన్ని ఇబ్బందులు కూడా పడ్డారు.

మా ఊర్లో సెల్‌ఫోన్ సిగ్నల్ కూడా సరిగ్గా వచ్చేది కాదు. వాళ్ళు కూడా తెచ్చుకున్న లాప్‌టాప్‌లకి ఇంటర్నెట్ కనెక్ట్ అయ్యేది కాదు. ఏసీ లేని రూముల్లో రాత్రుళ్ళు నిద్రపోవడానికి ఎన్నెన్నో అవస్థలు పడే వాళ్ళు. ఇన్వర్టర్ లేని ఇంట్లో కరెంటు కోత అంటే ఎలా వుంటుందో తెలుసుకుని భయపడిపోయారు. చీకటి పడిందంటే చాలు నిల్చున్నా కూర్చున్నా చుట్టూ ముసిరేసే దోమలని చూసి ఆశ్చర్యపోయేవాళ్ళు.

"అదేమిటి నాన్నా... ఇండియాలో మరీ ముఖ్యంగా పల్లెటూళ్ళలో ఇన్ని దోమలు? వీటి నివారణకి ప్రభుత్వం చర్యలు తీసుకోదా?" అని అడిగారు వేణుని వాడి పిల్లలు.

నేను నవ్వి చెప్పాను. "ప్రభుత్వం సంగతి మాకు తెలియదు. ఇక్కడ దేనికైనా ఎవరి జాగ్రత్తలు వాళ్ళు తీసుకోవడానికి మేము అలవాటుపడిపోయాం."

రాత్రి ఇంట్లోకి దోమలు రాకుండా ఎండిన వేపాకులు కాల్చి పొగవేస్తూ మా ఆవిడ భానుమతి చేసే ఏర్పాటుని అబ్బురంగా తిలకించేరు. అదే ఏర్పాటు మేము మా పాడి పసువులకి కూడా చేయడాన్ని గమనించి మరింత ఆశ్చర్యపోతే "అవి మాత్రం జీవులు కావా? వాటి పాడి మీద మనం ఆధారపడి జీవిస్తున్నాం అవి సుఖంగా వుంటేనే మనకి సుఖం" అని నేను చెప్పిన సమాధానం విని నన్ను మహాత్ముడిని చూసిన లెవెల్లో చూసారు వేణు కుటుంబ సభ్యులు.

ముట్టుకుంటే కందిపోయేంత అందంగా వున్న వేణు కొడుకునీ కూతురినీ భానుమతీ పిల్లలు సంభ్రమంగా చూసే వారు. వాళ్ళ అందంలో చక్కదనం కన్నా సౌకుమార్యమే ఎక్కువ వుందనీ ఆ సౌకుమార్యం వాళ్ళ జీవన విధానం వల్ల వచ్చినదనీ నేను కామెంట్ చేసినప్పుడు చిత్రంగా నవ్వింది భానుమతి.

"ఎందుకు నవ్వుతావు? రోజుకి నాలుగు మైళ్ళు సైకిలు మీద పొరుగూరికి స్కూలికి పంపకుండా వాళ్ళలా రోజూ కారులో స్కూలికి పంపి ఏసీ తరగతి గదుల్లో చదివిస్తే మన పిల్లలు వాళ్ళకంటే అందంగా మెరిసిపోయేవారు" అన్నారు.

నా మాటలకి ఆమె మళ్ళీనవ్వి ఊరుకుంది.

టౌనుకి కొంచెం దగ్గిరగా వున్న మా పక్క ఊళ్ళలో చాలామంది రైతులు రోడ్డుమీదకి వున్న పొలాలని ఇళ్ళ స్థలాలని చేసేసి అమ్మెయ్యడాన్ని చూపించాను వేణుకి బాధగా.

"ఇలా చేసుకుంటూ పోతే భవిష్యత్‌లో తిండి గింజలు కూడా దొరకవేమో" అన్నాడు వేణు.

"రియల్ ఎస్టేట్ వ్యాపారులు లక్షలకి లక్షలు ఆశ చూపిస్తున్నారు రైతుకి. పంట మీద అంత సంపాదించాలంటే రైతుకి జీవితంలో అయ్యే పనికాదు. ఇదివరకైతే ముందుతరాల వారి గురించి ఆలోచించేవారు. ఇప్పుడలా కాదు. ముందు మనం సంపాదించుకోవాలి, సుఖపడాలి... ఆ తర్వాతే ఉంటే గింటే వారసుల గురించి ఆలోచన. దీర్ఘకాలిక ప్రణాళికలు పోయాయి. అన్నీ తాత్కాలిక ప్రణాళికలే... ప్రపంచీకరణ ప్రభావం!" అన్నాను నవ్వుతూ.

మర్నాడు వేణుని స్కూలికి తీసుకెళ్ళాను. మేము చిన్నపుడు చదువుకున్న స్కూల్లోనే నేను ప్రస్తుతం ఉద్యోగం చేయడం నాకు ఒక చిత్రమైన అనుభూతి. వేణు కూడా చాలా ఆనందపడ్డాడు. ఇద్దరం స్కూల్లో చాలాసేపు గడిపాము. ఇప్పుడు స్కూలు కొత్త బిల్డింగులోకి మారింది. నేను వేణుని పాత బడిపోయి శిథిలమైపోయిన మా తరగతి గదుల దగ్గరికి తీసుకెళ్ళాను.

శిథిలమైపోయిన ఆ గదుల్లో పిచ్చిమొక్కల మధ్య ఆనందంగా తిరిగాము. వేణు చాలా ఎక్సయిట్ అయిపోయాడు. అటునుంచి వాడిని మా తెలుగు మాస్టారింటికి తీసుకుని వెళ్ళాను. ఆ రోజుల్లో ఆయన మా ఫేవరెట్ టీచర్. ఆయన్ని చూసి వాడెంత ఉద్విగ్నుడైపోయాడో మమ్మల్ని చూసి ఆయన కూడా అంతే ఉద్విగ్నులైపోయారు.

(మిగతా 12వ పేజీలో)

(9వ పేజీ తరువాయి)

"చాలా సంతోషంగా వుందిరా... నువ్వు దేశ దేశాలు తిరిగి పేరుతెచ్చుకుంటుంటే వీడు మన ఊర్లోనే వుంటూ గొప్ప పేరు తెచ్చుకుంటున్నాడు. మన ఊరికే గొప్ప పేరు తెస్తున్నాడు" అన్నారాయన మేము బయలుదేరుతుంటే. వేణు ఆయన మాటలకి అర్థంకానట్లుగా చూసాడు.

"ఏమిటి మాస్టారు అంటున్నది?" అడిగాడు నన్ను బయటికి వచ్చాక.

నేను నవ్వి వాడికి నేను స్కూల్లో నడుపుతున్న రాత్రి బడి గురించి చెప్పాను. చదువుతో పాటూ ఊర్లో వున్న యువతరానికి నేను పుస్తకాల్లో చదివిన వ్యవసాయ విజ్ఞానాన్ని, వ్యక్తిత్వ వికాసాన్ని కూడా బోధించడాన్ని చెప్పాను.

"వచ్చే వాళ్ళలో సగం మంది అప్పుడు మనతో చదువుకున్నవాళ్ళే. నేల విడిచి సాము చేయకుండా వాస్తవికంగా ఆలోచించి జీవితాన్ని ఎలా తీర్చిదిద్దుకోవచ్చో నాకు తోచినట్లు వాళ్ళకి చెబుతూ వుంటాను. అదే చాలా మందికి నచ్చుతోంది" అన్నాను.

వేణు నా వంక సంభ్రమంగా చూసాడు.

"నిన్ను చూస్తుంటే నాకు చాలా ఆశ్చర్యంగా వుందిరా... నీకున్న తెలివి తేటలకీ, కృషికీ నువ్వు ఎంతో ఎత్తుకి ఎదిగిపోవలసినవాడివి. కానీ అన్నీ త్యజించి ఒక యోగిలా జీవిస్తున్నావు. నాలాంటి వాళ్ళంతా ఊహల్లో చేయాలనుకునే వాటిని నువ్వు నిజంగా చేసి చూపిస్తున్నావు. ఈ రోజుల్లో నీలాంటి మనుషులు చాలా అరుదుగా వుంటారు" అన్నాడు.

* * *

వెళ్ళేరోజు వేణు భద్రాచలం ప్రోగ్రాం పెట్టాడు. భానుమతి, పిల్లలు రామన్నా వినకుండా బలవంతంగా అందరినీ బయలుదేరదీసాడు. మా ఊరి నుంచి లాంచిలో కొంత దూరం ప్రయాణం చేసి అక్కడినుంచి కారులో భద్రాచలం చేరుకున్నాం.

శీతాకాలపు చలిలో కూడా ఆ ఇంపోర్టెడ్ కారులోని ఏసీ చల్లదనం మమ్మల్ని గిలిగింతలు పెట్టింది. అద్దాలు బిగించిన కారులో వస్తున్న కమ్మటి పెర్ఫ్యూం వాసన ముక్కుపుటాలకి హాయిగా తగిలింది. ఎసి మిషను చేసే చిన్న శబ్దం తప్ప బయటి రొదేమి వినపడకుండా ఆ కారు ప్రయాణం మాకూ బయటి ప్రపంచానికీ మధ్య అందమైన తెరలేవో కట్టేసినట్లు అనిపించింది.

భద్రాచలం సమీపిస్తూనే వాళ్ళ సెల్ఫోన్లూ లాప్టాప్లో ఇంటర్నెట్లూ పనిచేయడం మొదలుపెట్టడంతో కొంతసేపు గట్టు మీద నుంచి నీటిలో పడ్డ చేప పిల్లల్లా అయిపోయారు. ఒక అరగంట సేపు మా ఉనికిని కూడా మర్చిపోయారు వాళ్ళు.

వేణు ముందుగానే బుక్ చేసిన వి.ఐ.పి. గెస్ట్హౌస్ దగ్గర కారు ఆగింది.

మూడురోజులుగా వాళ్ళకి ఆతిథ్యమిస్తున్న మేము ఆ చివరిరోజు వాళ్ళ ఆతిథ్యాన్ని స్వీకరించక తప్పలేదు. అంతకుముందు మేము ఎన్నోసార్లు చూసిన భద్రాచలమే వాళ్ళతో చూస్తుంటే కొత్తగా, ఖరీదుగా, విలాసవంతంగా, సౌకర్యవంతంగా కనిపించడం నన్ను ఆశ్చర్యపరిచింది.

వేణు నన్ను 'యోగి' అని ఎందుకన్నాడో అర్థమయింది!

* * *

మర్నాడు మమ్మల్ని బస్సు ఎక్కిస్తూ అన్నాడు వేణు. "నా దగ్గర ఒక ఆఫర్ వుంది. ఉద్యోగమే అనుకో లేదా పార్ట్నర్షిప్ అనుకో నువ్వెలా అంటే అలా. చాలా కాలంగా నీలాంటి వాడి గురించే చూస్తున్నాను నేను. వచ్చేస్తావా?"

ఒక్క క్షణం నేనేం విన్నానో నాకు అర్థంకాలేదు. వాడి నుంచి అలాంటి ఆఫర్ని నేను ఊహించలేదు. బహుశా నన్ను చూసి జాలి పడుతున్నాడేమో అనుకున్నాను.

"కంప్యూటర్ కీ బోర్డు ఎలా వుంటుందో కూడా తెలియదు నాకు. నేను నీ దగ్గరేం పనిచేయగలను?" వాడి మాటల్ని తేలికగా తీసి పారేస్తూ నవ్వాను.

"నీ తెలివి తేటల మీద నాకు నమ్మకం వుంది. అది కాదు ముఖ్యం. అందరూ మెదడుతో పనిచేస్తారు. నువ్వు మనసుతో పనిచేస్తావు. అదే నాకు కావలసింది."

నేను ఒక్క క్షణం మౌనంగా వుండిపోయాను.

"నువ్వే అన్నావు. నీకు మనూరికి వచ్చేసి ఒక పర్ణశాలలో ఆనందంగా జీవితం గడపాలని వుందని. ప్రస్తుతం నేను అలాంటి జీవితాన్నే గడుపుతున్నాను. దాన్ని వదిలేసుకుని నీదారిలోకి నన్ను రమ్మంటున్నావా? నా ఆశయాలన్నిటినీ వదిలేసుకుని నీలాంటి కాపిటలిస్టు దగ్గర పని చేయమన్నావా?" నవ్వుతూనే అడిగాను.

"భావుకత అందంగా వుంటుందిరా, కానీ అదే జీవితం కాదు. ఈరోజు ప్రపంచాన్ని చూడు ఎలావుందో. అందరూ డబ్బు వెనుకా అవకాశాల వెనుకా ఎలా పరిగెడుతున్నారో? అంతా ఒకవైపు వెళ్తుంటే నువ్వు మాత్రం ఏటికి ఎదురీదాలని ప్రయత్నిస్తున్నావు. కోపం తెచ్చుకోనంటే ఒక్క విషయాన్ని చెబుతాను. నేను నీ జీవన విధానంలోకి రావాలనుకుంటే ఇప్పుడు... ఈ క్షణంలో వచ్చెయ్యగలను. కానీ నువ్వు నా స్థాయిని చేరుకోవాలంటే చేరుకోగలవా? ఆలోచించు. నువ్వనుకునే ఆ ఆప్షన్ ఎప్పుడూ ఓపెన్గానే వుంటుంది. ఓపెన్ ఆప్షన్ గురించి బాధ పడడం వివేకం కాదు."

నేనేం మాట్లాడకపోవడంతో వాడే అన్నాడు. "ఒక్క మాటడుగుతాను గుండెల మీద చెయ్యేసుకుని చెప్పు? నీ జీవితం నీకు నిజంగా సంతృప్తికరంగా వుందా? పోనీ నీ భార్యా పిల్లలనడుగు... వాళ్ళ జీవితం వాళ్ళకి సంతృప్తికరంగా వుందా అని?"

ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాను నేను. నా మనసులో అంతకుముందు లేని భయాలేవో కొత్తగా తలెత్తసాగాయి.

"ఏమంటావ్?" అన్నాడు వాడు బస్సు కదిలిపోతుంటే.

"ఆలోచించి చెబుతాను..." అతి కష్టమ్మీద గొంతు పెగుల్చుకుని అన్నాను.

* * *


వేణు అడిగిన ప్రశ్నని భానుమతి నడుగుదామనుకుని చాలాసార్లు ప్రయత్నం చేసాను. కానీ ఆమె నుంచి ఏ సమాధానం వస్తుందో ఊహించుకోవడానికే భయమేసి మానేసాను. అయినా నా వైఫల్యాలకి ఇతరులని బాధ్యుల్ని చేయడం నాకిష్టంలేదు.

కొద్ది రోజులకే వాడి ప్రతిపాదనకి నా అంగీకారాన్ని తెలియచేస్తూ వేణుకి ఫోన్ చేసాను.

ప్రవాహానికి ఎదురీదడం కన్నా వాలులో కొట్టుకుపోవడమే సుఖంగా వుంటుంది- ఎక్కడో అక్కడ మునిగిపోతామని తెలిసినా.

ఇప్పుడు కూడా నేను 'యోగి'నే!

★



## డైనోసార్స్

డైనోసార్స్ భూమిమీద 135 మిలియన్ల సంవత్సరాల క్రితం జీవించిన అతి పెద్ద సరీసృపాలు. శిలల మధ్యను, నేల క్రిందను అతుక్కుని ఉన్న వీటి జీవస్థ శిలలను బట్టి మనకు రాక్షస బల్లులను గురించి తెలుస్తోంది. ఈ రాక్షస బల్లులు అవలీలగా మూడు అంతస్తుల మేడలోకి కూడా తొంగి చూడగలవు. కొన్ని నీళ్ళలో నివసించేవి. మరికొన్ని ఎగిరేవి కూడా ఉంటాయి. రెండురకాల రాక్షస బల్లులు ఉన్నాయి. ఒకటి మాంసాన్ని తినేవి. ఇంకొక రకం మాంసం తిననివి. మాంసాన్ని తినే రాక్షస బల్లులు, మాంసం తినని వాటిని పట్టుకుని తినడం చేత ఇవి అంతరించాయి. నదులు, సరస్సులు ఎండిపోతే మొక్కలు సరిగా పెరగవు. ఈ కారణంవలన మాంసాన్ని తినని రాక్షస బల్లులు అంతరించాయి.

**- పి.ఎం.సుందరరావు**

## కుర్చీ రాణి

మహారాజులు, మహారాణులు ఖుషీగా గుర్రపు బండ్లలోనూ, పల్లకీలలోనూ తిరుగుతూ వుండేవారని విన్నాం. అయితే 'మేరీ థెరిస్సా' అనే హంగేరీ దేశపు మహారాణి తన జీవిత కాలమంతా కుర్చీలో కూర్చునే గడిపింది. ఒక గది లోంచి మరో గదిలోకి వెళ్ళడానికి పనివారు వచ్చి ఆ మహారాణి కూర్చుని వున్న కుర్చీని మోసుకు పోవాలి. ఆమె రాజసానికి సేవకులు కూడా విసుక్కునేవారు. 'ఇదెక్కడి మోతరా బాబూ!' అది అనుకోని రోజు లేదు.